సాక్షి
అనకాపల్లి
బుధవారం । 7 । జూన్ । 2023



గిరిపుత్రుల జీవనంపై సినిమా

దర్శక నిర్మాత గవిరెడ్డి శ్రీనివాసరావు గిరిపుత్రుల జీవనంపై ఏజెన్సీ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరిస్తున్నారు. 8లో



15 వేల మొక్కలు నాటడం లక్ష్యం

జేఎన్ ఫార్మాసిటీలో ఈ ఏడాది 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు రాంకీ ఎండీ లాల్‌కృష్ణ తెలిపారు. 8లో

అనకాపల్లి ఉష్ణోగ్రత
గరిష్టం / కనిష్టం
38.8° / 27.0°

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు 36.4 నుంచి 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రేపు స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి రాక

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయ పునర్నిర్మాణానికి ఈనెల 8న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి శంకుస్థాపన చేయనున్నారని ఆలయ ఈవో అన్నపూర్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి హాజరవుతారని ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: సమగ్ర శిక్ష కార్యాలయం జిల్లా గర్ల్ చైల్డ్ అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ స్టాటస్టిక్స్ అధికారి పోస్టులలో డిప్యుటేషన్‌పై పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటన విడుదల చేశారు. 50 ఏళ్ల లోపు వయసున్న ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీలోగా తమ దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయానికి నేరుగా సమర్పించాలన్నారు. దరఖాస్తులు, సూచనలు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు.

కమ్యూనిస్టు నేత మాకిరెడ్డి మృతి



వై.మాకిరెడ్డి (ఫైల్)

నర్సీపట్నం: మాకిరెడ్డి ఎర్రినాయుడు అలియాస్ వై.మాకిరెడ్డి (76) విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజున మాకిరెడ్డి జన్మించారు. స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థి సంఘ నాయకుడిగా (ఏఐఎస్ఎఫ్) రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. వామపక్ష పార్టీలలో వై.మాకిరెడ్డి సుదీర్ఘ కాలం పనిచేసి తనదైన ముద్ర వేసుకున్నారు. దళిత, గిరిజన వర్గాల ప్రజల భూ సమస్యలపై అనేక పోరాటాలు చేసి అండగా నిలిచారు. ప్రస్తుతం రాష్ట్ర సమాచార హక్కు చట్టం ఫోరం కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. మాకిరెడ్డి మృతికి వామపక్ష నాయకులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ గడువు పొడిగింపు



వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలలకు ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించినట్లు పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వాస్తవానికి సోమవారంతో గడువు ముగినప్పటికీ.. విద్యార్థులకు మరొక అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో గడువు పొడిగించారన్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించుకోవడానికి, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి అనివార్య కారణాల వల్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరు సమీప హెల్ప్‌లైన్ కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్లు పరిశీలన చేసుకోవచ్చన్నారు. వెబ్ ఆప్షన్లకు సంబంధించి సమాచారం రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వెబ్‌సైట్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. కాగా.. జిల్లాలోని వివిధ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మంగళవారం కౌన్సెలింగ్ కొనసాగింది. విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు.

10న హైకోర్టు సీజే విశాఖ రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఈ నెల 10న విశాఖ వస్తున్నారు. సాయంత్రం 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళ్తారు. అక్కడే రాత్రి బస చేస్తారు. 11న రైలులో తిరిగి విజయవాడ వెళతారు.


జస్టిస్ చక్రవర్తి రాక నేడు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి బుధవారం విశాఖ వస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం విశాఖ చేరుకుని.. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోని పోలీస్ గెస్ట్ హౌస్‌కు వెళ్తారు. అనంతరం బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత సంపత్ వినాయగర్ ఆలయాన్ని సందర్శించి.. అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు.

జస్టిస్ రాధాకృష్ణ కృప సాగర్..

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.రాధాకృష్ణ కృప సాగర్ బుధవారం విశాఖ వస్తున్నారు. రత్నచల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకుని.. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు. సాయంత్రం వేపగుంటలో జరిగే వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి విజయవాడ వెళతారు.

విశ్వవిపణిలో మన సత్తా



బెల్లం ఉత్పత్తులు

- త్వరలో విదేశాలకు బెల్లం పొడి
- ఆ దిశగా ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల అడుగులు
- యూపీ, మహారాష్ట్రలకు దీటుగా ఉత్పత్తులు
- దేశంలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా గుర్తింపు
- మునగాకు రసం, తేనె, నిమ్మ రసం సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారీ

సాక్షి, అనకాపల్లి: పంచదారతో పోలిస్తే బెల్లంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ఔషధ గుణాలకూ కొదవ ఉండదు. జీర్ణశక్తిని పెంచడం.. రక్తహీనతను తగ్గించడం వంటి సుగుణాలెన్నో బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. అలాంటి బెల్లం ఎగుమతుల్లో దేశంలోనే అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా అనకాపల్లికి గుర్తింపు ఉంది. యూపీ, మహారాష్ట్రలకు దీటుగా అనకాపల్లి బెల్లం ఎగుమతి అవుతోంది. ఉత్పత్తికి మించి అధికంగానే ఆర్డర్లు కూడా వస్తున్నాయి. అయితే బెల్లంతో పాటు బెల్లం పొడి, బెల్లం ఆధారిత ఉత్పత్తులను మరింత పెంచే విధంగా ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే అంతర్రాష్ట్రాల వరకూ బెల్లం పొడిని ఎగుమతి చేస్తున్నా.. పూర్తి స్థాయిలో విదేశాలకు కూడా ఎగుమతి చేసే ఆలోచనలో ఆర్ఏఆర్ఎస్ ఉంది. బెల్లంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం కారణంగా నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. బెల్లం ఉత్పత్తులే ఎగుమతి అవుతున్నాయి గానీ బెల్లం విదేశాలకు ఎక్కువ స్థాయిలో ఎగుమతి కావడం లేదు. బెల్లంలో తేమ శాతాన్ని తగ్గించి దాని నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బెల్లంతో విలువ ఆధారిత ఇతర ఉత్పత్తుల తయారీని పెంచడం, వాటిని విదేశాలకు ఎక్కువ స్థాయిలో ఎగుమతి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. బెల్లంలో 12 నుంచి 13 శాతం వరకూ తేమ ఉండి.. నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. దాన్ని 3 శాతానికి తగ్గించి.. వాటికి అదనంగా మునగాకు రసం.. తేనె, నిమ్మ రసాలను సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారు చేస్తున్నారు. దీన్ని ఎక్కువ మోతాదులో తయారు చేసి విదేశాలకు బెల్లం పొడి, బెల్లం ఆధారిత ఉత్పత్తులను ఎగుమతి చేయడంపై అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందుకు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.3.5 కోట్ల నిధులతో ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.

బెల్లం ఉత్పత్తుల పెరుగుదలతో రైతులకు లాభం

వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఆధారిత ఉత్పత్తులు ఈ సెంటర్ ద్వారా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి కానున్నాయి. మూడు రకాల చెరకు, చిరుధాన్యాలు, పనసల ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన బెల్లం తయారీతో పాటు.. బెల్లం ఆధారిత ఉత్పత్తులు ఇక్కడి నుంచి దేశం నలుమూలలకు ఎగుమతి అవుతాయి. దీంతో చెరకుపై ఆధారపడి జీవించే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఆర్ఏఆర్ఎస్‌లో ప్రస్తుతం తయారు చేస్తున్న బెల్లం ఆధారిత ఉత్పత్తుల్లో ఘన బెల్లం, పొడి బెల్లం, లిక్విడ్ బెల్లం, బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్సు బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, బెల్లం చాక్లెట్లు, బెల్లం పల్లీ చెక్కీలు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం అంతర్రాష్ట్ర స్థాయిలో ఎగుమతి అవుతున్నాయి.

బెల్లం పొడి ఉపయోగాలు..

- బలమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయ పడుతుంది.
- జీర్ణ సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది.
- ఎక్కువ కాలం పాటు శక్తిని అందిస్తుంది.
- ఎముకలు దృఢంగా ఉంటాయి
- కడుపు చికాకు నుంచి ఉపశమనం, తలనొప్పి నయం, జలుబు లక్షణాలను దూరం చేస్తుంది.



ఆర్ఏఆర్ఎస్‌లో తయారైన బెల్లం పొడి

బెల్లంపొడికి విదేశాల్లో చక్కని డిమాండ్

గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఇతర లవణాలు, ప్రోటీన్ల వల్ల త్వరగా బూజు పట్టడం, నీరు కారటం వంటి కారణాల వల్ల బెల్లం నాణ్యత చెడిపోతుంది. దీనిని నివారించేందుకు అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం బెల్లాన్ని పొడి రూపంలో మార్చే సాంకేతికతను అభివృద్ధి చేసింది. బెల్లం పొడిని వివిధ రకాలుగా తయారు చేసి ఎగుమతులకు కృషి చేస్తోంది. తెల్ల బెల్లం పొడి, హెర్బల్ బెల్లం పొడి, మూలిక బెల్లం పొడి, మునగ బెల్లం పొడి, తేనె బెల్లం పొడి, నిమ్మ బెల్లం పొడి వంటి రకాలు కూడా ఉంటాయి. గోధుమ వర్ణంలో ఉండే బెల్లం పొడికి అమెరికా, ఫిలిప్పీన్స్, కొలంబియా, ఇండోనేషియా దేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో తయారయ్యే బెల్లం పొడి నాలుగు రకాలు మాత్రమే తయారు అవుతోంది.

చెరకు రైతులకు మంచి రోజులు



బెల్లం పొడిని ఎక్కువగా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తే.. స్థానికంగా చెరకు సాగు పెరుగుతుంది. చెరకు రైతులకు మంచి రోజులు వస్తాయి. త్వరలో ఇంక్యుబేషన్ సెంటర్ కూడా నిర్మాణం అయితే.. ఇక్కడి నుంచి బెల్లం పొడి, బెల్లం ఉత్పత్తి ఆధారిత పదార్థాలు కూడా ఇక్కడి నుంచే ఎగుమతి కానున్నాయి. వీటి కారణంగా ఆరోగ్యం కూడా పొందొచ్చు. ప్రధానంగా చెరకు ఆధారిత రైతులందరికీ ఇదొక శుభవార్తగానే చెప్పొచ్చు.

– పీవీకే జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ ఏడీ

పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మొక్క నాటుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అచ్యుతాపురం (అనకాపల్లి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన అచ్యుతాపురం ఏపీఐఐసీ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున మొక్కలు నాటే కార్యక్రమానికి యాజమాన్యాలు తమ వంతు సహకరించాలని కోరారు.

సుమారు 10 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాలుష్య నియంత్రణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గ్రీన్‌మిలియన్ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన, కాలుష్య కారకాల తొలగింపు ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, వివిధ పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొన్నారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్ (విశాఖ): మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 8న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జరిగే సమావేశంలో సభ్యుల ఆమోదానికి 22 అంశాలను అజెండాలో రూపొందించారు. జీ–20 సదస్సు నిర్వహణ దృష్ట్యా జోన్–1లో 45 రోజుల పాటు రోజుకు 20 మందితో పారిశుధ్య పనులు చేపట్టారు. ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.549 చొప్పున ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం చెల్లించే విషయమై సభ్యులు చర్చించనున్నారు. జోన్–5 పరిధి 49వ వార్డులో ఇంటింటా చెత్త సేకరణకు నాలుగు టాటా ఏస్ వాహనాలు నెల రోజుల పాటు తిప్పినందుకు రిజిస్టర్ కాంట్రాక్టర్ ద్వారా నామినేషన్ పద్ధతిన చేపట్టిన పనుల ఆమోదంపై చర్చ సాగనుంది. జీవీఎంసీ ఐటీ విభాగం టెలికాన్ఫరెన్స్‌కు సంబంధించి ఏప్రిల్, మే బిల్లులు రూ.8 లక్షలు చెల్లింపులు, వివిధ విభాగాల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న శాశ్వత, పొరుగు సేవలందిస్తున్న కార్మికులకు వార్షిక బీమా ప్రీమియం చెల్లింపు, విలీన పంచాయతీ కార్మికులకు నెల జీతం ఎస్ఎంఆర్ రేట్లకు రెమ్యునరేషన్ పద్ధతిలో చెల్లింపు, జోన్–5 పరిధి గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్–1 వేలం పాట తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతం

పీఎంపాలెం(భీమిలి): విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తోట అజయ్(24) శుభకార్యాలు, పండగల నిర్వహణకు ఈవెంట్స్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తుంటాడు. ఈయనకు నెల రోజుల క్రితం వివాహమైంది. తల్లిదండ్రులు స్థానిక గాయత్రినగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివసిస్తున్నారు. భార్య కుసుమతో కలసి అజయ్ లక్ష్మీవానిపాలెంలో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సుజల స్రవంతికి వైఎస్సార్ జీవం పోశారు

- ప్రాజెక్టును వైఎస్ జగన్ పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సీపీఐ నేత సత్యనారాయణమూర్తి

అనకాపల్లి టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు జీవం పోశారని, జగన్ దీనిని పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కోరారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో మంగళవారం సుజలస్రవంతి ప్రాజెక్టుపై జరిగిన ఉత్తరాంధ్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్ జీవించి ఉంటే ఏనాడో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి వచ్చేదన్నారు. తర్వాత వచ్చిన పాలకులు ప్రాజెక్టు వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. 2018లో చంద్రబాబు మళ్లీ అదే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, ఈ ప్రాజెక్టును అడ్డంపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందారని విమర్శించారు. బాబుకు ఉత్తరాంధ్ర అంటే చిన్నచూపేనని ధ్వజమెత్తారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నుంచి 80 లక్షల ఎకరాలకు నీరందుతుంటే ఉత్తరాంధ్రలో 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఉత్తరాంధ్రలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతితోపాటు సాగునీటి నిల్వలపై వచ్చే ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. సుజలస్రవంతి ప్రాజెక్టును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఓబులేసు, సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రైతులు, కమ్యూనిస్ట్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం.. సన్యాసమ్మతల్లి సంబరం



ఆకట్టుకున్న దేవతామూర్తులు, కాంతార వేషధారణలు



అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే ప్రభలు

దేవరాపల్లి: శ్రీసన్యాసమ్మ తల్లి పెద్ద పండగ జనసంద్రాన్ని తలపించింది. 12 ఏళ్ల తర్వాత మంగళవారం జరిగిన మహోత్సవానికి వేలాదిగా భక్తజనం తరలిరావడంతో దేవరాపల్లి రహదారులన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తులు, కాంతార, పులి, నెమలి వేషధారణలు, మహిళ తీన్‌మార్, కోయ డ్యాన్స్, ధింసా నృత్య ప్రదర్శనలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ సన్యాసమ్మ అమ్మవారికి ప్రతిరూపంగా కొలిచే ప్రభను చూసేందుకు భక్తులుబారులు తీరారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతరం రాత్రికి పలు సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ఆయనకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు తదితర ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తుల పెన్నిధి మోదమ్మ సన్నిధి



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్) ఘటాలను పెట్టుకుని సతకం పట్టు వద్ద నుంచి తిరిగి ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత మాడుగుల మోదకొండమ్మ పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. పూలమాలలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అపూర్వంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఘటాలను శిరసున పెట్టుకుని సుమారు 3 కిలోమీటర్ల దూరం బారులు తీరారు. సతకం పట్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. విప్రో (సంతూర్) కంపెనీ సహకారంతో బస్టాండ్‌లో రామా మెడికల్ షాపు వద్ద సుమారు రెండు వేల మందికి గ్లూకోజ్ ద్రావణం ఉచితంగా అందజేశారు. ఆలయం వద్ద విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 1500 మంది భక్తులకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. సతకం పట్టు వద్ద మోదమాంబ సాయిలక్ష్మి వర్తక సంఘం వారు సుమారు రెండు వేల మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కోట్యాడ రమేష్, అరుణ దంపతుల ఆర్థిక సహాయంతో మోదకొండమ్మ ఆలయం రోడ్డులో సుమారు రెండు వేలమందికి ఉచితంగా ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నేలవేషాలు

ఎడ్లబళ్ల వేషాలు, తప్పెటగుళ్లు, ఖవ్వాలీ డ్యాన్స్‌లు, పులివేషాలు, కేరళ, ఢమరుక నాదాలు, కర్ణాటక మహిళా కళాకారులతో డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు చూపరులను ఆకట్టుకున్నాయి. మహరాజుల కోటలో బాణసంచా వెలుగులను భక్తులు ఆసక్తిగా తిలకించారు. పండగ రోజుల్లో సురభి బృందం ప్రదర్శించిన నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గట్టి పోలీసు బందోబస్తు

జాతర సజావుగా సాగడానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి, క్యూ పద్ధతిలో దర్శనానికి వచ్చిన భక్తులను పంపించడంతో ప్రశాంత వాతావరణంలో అమ్మవారి నెల రోజుల పండగ ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి సన్నిధిలో మాడుగుల మహారాణి

మాడుగుల మహారాణి మయాంక కుమారిదేవ్ మంగళవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన రాణికి ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, పైడినాయుడు ఘనస్వాగతం పలికారు.

క్లుప్తంగా

కొత్తపేటవీధిలో చోరీ

యలమంచిలి : స్థానిక కొత్తపేటవీధికి చెందిన దొడ్డి సాయికుమార్ ఇంట్లో మంగళవారం దొంగలు ప్రవేశించి రెండు కెమెరాలు, రెండు సెల్ ఫోన్లు అపహరించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు. బాధితుడు సాయికుమార్ బంధువులింట పెళ్లికి సోమవారం వేరే ఊరు వెళ్లాడు. రాత్రి ఇంటికి చేరుకున్నారు. మధ్య రాత్రిలో ఎవరో తలుపు తట్టినట్టు అనిపిస్తే, లేచి బయటకు వెళ్లి చూడగా, ఎవరూ కనిపించలేదు. దీంతో నిద్రపోయారు. తిరిగి ఉదయం నిద్రలేచాక చూస్తే తలుపు తెరిచి ఉంది. ఇంట్లో వస్తువులను పరిశీలించగా కెమెరాలు, ఫోన్లు దొంగతనానికి గురైనట్టు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

జాతీయ సదస్సుకు కేంద్ర మంత్రికి ఏయూ ఆహ్వానం



కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామిని ఆహ్వానిస్తున్న ఏయూ అధికారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, అంబేడ్కర్ చెయిర్ సంయుక్తంగా వచ్చే నెల 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న ‘డిజైన్ థింకింగ్’పై రెండు రోజుల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నారాయణస్వామిని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆహ్వానించారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచనతో మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రిని కార్యాలయంలో కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గతేడాది కాలంగా అంబేడ్కర్ చెయిర్ నుంచి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రి సూత్రప్రాయంగా సదస్సులో పాల్గొనడానికి అంగీకారం తెలుపుతూ సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు తమకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కు పత్రాలున్న భూముల అభివృద్ధికి ప్రణాళిక

- జిల్లాలో 3,741 మంది అటవీ హక్కు పత్రాల పంపిణీ
- గిరిజనులకు 50 పని దినాలు పెంచిన ప్రభుత్వం
- ఉపాధి హామీ పథకం అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రోజారాణి



సరుగుడులో అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజనులతో ఉపాధి పథకం ఏపీడీ రోజారాణి

నాతవరం : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన లక్షా 76 వేల కుటుంబాలకు రూ.146 కోట్ల చెల్లింపులు చేసినట్టు పథకం అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రోజారాణి తెలిపారు. మండలంలోని సరుగుడు, రామన్నపాలెం, అచ్చంపేట గిరిజన గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమె, ఉపాధి కూలీలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కోటి 10 లక్షలు పని దినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంత వరకు 55 లక్షల 11 వేల పని దినాలు పూర్తయినట్టు తెలిపారు. ప్రస్తుతం రోజుకు లక్షా 45 వేల మంది కూలీలు పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెలాఖరులోగా లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో గిరిజనులకు ఇంతవరకు ప్రభుత్వం 3,741 మందికి అటవీ హక్కు పత్రాలు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. హక్కు పత్రాలు పొందిన గిరిజనుల భూమిలో పండ్ల తోటల పెంపకం, భూమిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఉపాధి నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి గిరిజనుల అభీష్టం మేరకే భూమిని అభివృద్ధి చేసి, ఆదాయాన్నిచ్చే పండ్ల తోటలు పెంచేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. హక్కుపత్రాలు పొందిన గిరిజనులు తమ భూమి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అన్‌లైన్‌లో నమోదు చేసి, నిధుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల్లో నమోదు చేసుకున్న గిరిజనులకు పండ్ల తోటల పెంపకానికి ఎకరానికి రూ.50 వేల వరకు రెండేళ్ల పాటు ఇస్తామన్నారు.

ఉపాధి హామీ పథకంలో భూములు అభివృద్ధి చేసే గిరిజనులకు 150 రోజుల పని దినాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ పథకంలో అభివృద్ధి చేసేందుకు నాతవరం మండలం సరుగుడు పరిసరాల్లో 100 ఎకరాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీ హక్కు పత్రాలు పొందిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1000 ఎకరాలలో వివిధ రకాల పండ్ల తోటలు పెంచాలని కలెక్టరు లక్ష్యాన్ని విధించగా, 776 ఎకరాలకు అన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి, నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో గ్రీన్ మిలియన్ ప్రోగ్రాంలో భాగంగా 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా అందులో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో 2 లక్షల 50 వేలు వేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. మిగతావి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన ప్రతి చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు వేస్తామన్నారు. ఈ చెరువుల అభివృద్ధి సామాజిక తనిఖీకి ప్రత్యేక బృందాన్ని నియమించినట్టు తెలిపారు. వారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఉపాధి హామీ పథకం నర్సీపట్నం క్లస్టర్ ఏపీడీ గాడి నానిబాబు, సరుగుడు సర్పంచ్ గంగరాజు, ఏపీవో చిన్నారావు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిపుత్రుల జీవనంపై సినిమా



హీరో, హీరోయిన్లు, సీఐ వేషధారి



పారా మిలటరీ వేషధారణలో ఆర్టిస్టులు

- రూ.25 కోట్ల వ్యయంతో చిత్రీకరణ
- దర్శక నిర్మాత గవిరెడ్డి శ్రీనివాసరావు



రోలుగుంట : రోలుగుంట, నాతవరం మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నర్సీపట్నం నియోజకవర్గం కొండలఅగ్రహారం పంచాయతీ బయపురెడ్డిపాలేనికి చెందిన గవిరెడ్డి శ్రీనివాసరావు రూ.25 కోట్ల వ్యయంతో చిత్ర నిర్మాణం చేపట్టారు. ఈ చిత్ర నిర్మాణంలో భాగంగా రోలుగుంటలోని వైబీ పట్నం, లోసింగి అటవీ ప్రాంతంలో బ్రిడ్జి, గిరిజన కుటీరాల సెట్ వేశారు. ఈ సెట్‌లో నక్సలైట్లు, పోలీస్ మధ్య కాల్పుల సీన్‌ను మంగళవారం చిత్రీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బతుకులు, గంజాయి, మావోయిస్టుల ప్రభావంపై వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ సినిమాను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాల ద్వారా గిరిజనులు ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చో ఈ సినిమాలో చర్చిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఈ చిత్రంలో సుమారు 400 మంది నటులకు అవకాశం కల్పించామన్నారు. మండలంతో పాటు నాతవరంలోని గిరిజన గ్రామాల్లో కూడా చిత్రీకరణ జరిపినట్టు వెల్లడించారు. ఈ చిత్రంలో హీరో ఆదర్శ్, హీరోయిన్లుగా వైశాలి, సీఐగా భరణి నటిస్తున్నట్టు తెలిపారు. నటులు, స్థానికుల సహకారంతో శరవేగంగా చిత్రీకరణ జరుగుతోందని, తప్పకుండా తమ చిత్రం విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

నేడు స్వయంభూ విఘ్నేశుని గోపుర కలశ స్థాపన

చోడవరం : స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయ రాజగోపుర కలశ స్థాపన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం యాగశాలలో శ్రీ లక్ష్మీ గణపతి హోమాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయానికి తూర్పు, పశ్చిమ రాజగోపురాలను ఇటీవల నిర్మించారు. వీటిని ప్రారంభించేందుకు ఈ నెల 4 నుంచి 7 వరకు కలశ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు కార్యక్రమాల్లో భాగంగా హోమంతోపాటు, ఆలయ, యాగశాల ప్రదక్షిణ, పుష్పదివాసం, సుందరకాండ పారాయణ, మహాలక్ష్మి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన ఉత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. చివరి రోజున రాజగోపురాలకు పంచలోహాలతో తయారుచేసిన కలశాలను స్థాపిస్తారు. ఇందుకు భారీ ఏర్పాట్లు చేశారు. తూర్పు, పశ్చిమ గోపురాలు 40 అడుగుల ఎత్తులో నిర్మించడంతో, ఆ గోపురాలపై కలశాలను ప్రతిష్టించేందుకు కర్రలతో భారీ మెట్లు ఏర్పాటు చేశారు. సిద్ధం చేసిన కలశాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం పరిశీలించారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధనకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ఈ పనులను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నున్న నాగేశ్వరరావు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

మూడోరోజు ఉత్సవాల్లో లక్ష్మీగణపతి హోమం చేస్తున్న వేదపండితులు



15 వేల మొక్కలు నాటడం లక్ష్యం

- రాంకీ ఎండీ లాల్‌కృష్ణ



మొక్కలు నాటుతున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ : జేఎన్ ఫార్మాసిటీలో ఉద్యోగుల సహకారంతో ఈ ఏడాది 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్‌కృష్ణ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా రాంకీ ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మాసిటీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటడం మన సంస్కృతిలో భాగం కావాలన్నారు. ఈ ఏడాది ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రపంచ పర్యావరణ శాఖ థీమ్‌గా ఎంచుకుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్, ఎస్సే రైటింగ్, స్లోగన్ రైటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాంకీ ప్రతినిధులు చంద్రశేఖర్, మోహన్, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి

- నిందితుడి అరెస్ట్



అరెస్టైన కరణం వెంకట నాగేంద్ర బాబు(23)

కోటవురట్ల : మండలంలోని నరసింగబిల్లి వద్ద 19 ఏళ్ల యువతి లైంగిక దాడికి గురైంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగు చూసింది. మంగళవారం నిందితుడిని పట్టుకుని కోర్టుకు తరలించారు. అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవి కుమార్ విలేకరులకు అందించిన వివరాలు. మండలంలోని నరసింగబిల్లి వద్ద తమ గ్రామానికి వెళ్లేందుకు 19 ఏళ్ల యువతి వాహనం కోసం ఎదురుచూస్తుండగా, సోమవరం గ్రామానికి చెందిన కరణం వెంకట నాగేంద్రబాబు(23) సోమవారం సాయంత్రం బైక్‌పై ఆమె వద్దకు వెళ్లి ఆగి మాట్లాడాడు. ఆమె తనతో రావడానికి నిరాకరించడంతో బలవంతంగా బైక్ ఎక్కించుకొని నరసింగబిల్లి రైల్వే గేటు వద్దకు బయల్దేరి, అక్కడి నుంచి పక్క మార్గంలో తీసుకెళ్లాడు. అక్కడ రైల్వే అండర్ పాసు వద్ద బైక్ నిలిపి ఆమెను లోపలికి బలవంతంగా లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. మంగళవారం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవరంలో తన ఇంటి వద్దనున్న నిందితుడు నాగేంద్రబాబును అరెస్ట్ చేశారు. నిందితుడ్ని అనకాపల్లి కోర్టులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరు పరచినట్లు తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి

- అపస్మారక స్థితిలో మరో మహిళ



అపస్మారక స్థితికి చేరిన లక్ష్మి

మాకవరపాలెం : పిడుగులు పడి ఒక మహిళ మృతి చెందగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. మండలంలో మంగళవారం సాయంత్రం పిడుగులు, ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఆ సమయంలో లచ్చన్నపాలెంలో ఇటంశెట్టి రమణమ్మ(47) పశువులకు గడ్డిని తీసుకువస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. తూటిపాలలో మామిడి కాయలు కోస్తుండగా సమీపంలో పిడుగు పడటంతో అనిమిరెడ్డి లక్ష్మి(50) అపస్మారక స్థితికి చేరింది. ఈమెను వెంటనే 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలు రమణమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఒడిశాలో రైలు ప్రమాదం కారణంగా ట్రాక్‌ల నిర్వహణ, లింక్ రైళ్ల రాకపోకల ఆలస్యంతో ఆయా స్టేషన్లలో బయలుదేరాల్సిన పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని సూచించారు.

- హౌరా-బెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-వాస్కోడగామా(18047) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-తిరువనంతపురం (22642) ఎక్స్‌ప్రెస్ మంగళవారం రద్దయ్యాయి.
- హౌరా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళ, బుధవారాల్లో రద్దు చేశారు.
- షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమార్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హౌరా (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం(22831) ఎక్స్‌ప్రెస్, తాంబరం-సంత్రగచ్చి (22842) ఎక్స్‌ప్రెస్, భాగల్‌పూర్-విశ్వేశ్వరయ్య టెర్మినల్ (12254) ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి- డిబ్రూఘడ్ (22503) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-సికింద్రాబాద్ (12773)ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం రద్దు చేశారు.
- బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా(22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 8న రద్దు చేశారు.
- వాస్కోడగామా-షాలిమార్ (18048) ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయ
- హౌరా (22832) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 9న రద్దు చేశారు.

10న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పలు నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 10న విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

సామాన్యుల సొంతింటి కల నెరవేరాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.నరేష్

మద్దిపాలెం(విశాఖ ఉత్తర): రియల్ ఎస్టేట్ రంగం ఎదుగుదలతో పాటు సామాన్యుల సొంతింటి కల నెరవేరాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ సాకా నరేష్ అన్నారు. ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్(టీడీఎస్)పై విశాఖపట్నం క్రెడాయ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రియల్ ఎస్టేట్ రంగం ద్వారా జీడీపీలో 7 శాతం ఆదాయం సమకూరుతోందని, ఇది పది శాతానికి చేరే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరం దేశంలోనే 9వ అతి పెద్ద ధనిక నగరంగా రూపొందిందని చెప్పారు. టీడీఎస్ రెవెన్యూ అనుకున్నదానికి అనుగుణంగా పెరగడం లేదన్నారు. పన్ను చెల్లింపుదారుల అవగాహన లోపం ఇలా జరుగుతోందని ఆయన వివరించారు. పన్ను చెల్లింపు విషయంలో బిల్డర్లు తమ బాధ్యతను తెలుసుకుని సహకరించాలన్నారు. విశాఖ రిజీయన్ ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కమిషనర్ శంకర్‌పాండే, క్రెడాయ్ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు వి.ధర్మేందర్ మాట్లాడుతూ వైజాగ్ చాప్టర్‌లో 400 మంది సభ్యులు ఉన్నారని, వీరంతా టీడీఎస్ చెల్లింపు విషయంలో అందరి కన్నా ముందుంటారన్నారు. ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసర్ (ఏలూరు) ఇమ్‌తాజ్ టీడీఎస్ చెల్లింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇమీడియట్ పూర్వ చైర్మన్ బి.శ్రీనివాస్, క్రెడాయ్ కార్యదర్శి వి.శ్రీను, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం... ఆదుకోండి

- భర్త కోసం ఓ భార్య వేడుకోలు
- ఆమె పోలియో బాధితురాలు
- అతనికి రెండు కిడ్నీలు పాడయ్యాయి..



డయాలసిస్ చేసుకుంటున్న భర్తతో దివ్యాంగురాలైన వరలక్ష్మి

డాబాగార్డెన్స్: ఆమె పోలియో బాధితురాలు.. చిన్నప్పుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ఓ ఆటోడ్రైవర్ ఆమెను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. దివ్యాంగురాలిని చేసుకున్నవంటూ అతని తల్లిదండ్రులు వీరిని వదిలేశారు. వీరి అన్యోన్య దాంపత్యానికి ఇద్దరు సంతానం. జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో.. విధి కన్నెర్ర జేసింది. 2015లో ఆ ఇంటి యజమానికి కిడ్నీ వ్యాధి సోకింది. ఉన్న ఆస్తులు అమ్మి భర్తకు ఆమె వైద్యం చేయించింది. కొందరు దాతల సాయంతో కొంత కాలం నెట్టుకొచ్చింది. 2020లో వ్యాధి ముదిరింది. అతని రెండు కిడ్నీలూ పాడైపోయాయి. భర్త మంచం పట్టాడు. దాతలెవరైనా ముందుకొచ్చి కిడ్నీ ఇస్తే శస్త్రచికిత్సకు రూ.10లక్షలు అవుతుందని వైద్యులు సూచించారు. దివ్యాంగురాలైన ఆమె ఇద్దరు పిల్లలను చూసుకుంటూ.. మంచం పట్టిన భర్త ఆవేదనను తట్టుకోలేక తల్లడిల్లుతోంది. దాతల సాయం కోసం ఆశగా ఎదురు చూస్తోంది.

హెచ్‌బీకాలనీ రామాలయం వీధికి చెందిన జి.వరలక్ష్మి చిన్న తనంలోనే పోలియో వ్యాధికి గురైంది. రెండు కాళ్లు పోగొట్టుకుంది. ఆమె భర్త శ్రీనివాసరావు ఆటో నడిపేవాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2015 వరకు వీరి కుటుంబం సాఫీగా సాగింది. ఆ తర్వాత భర్తకు కిడ్నీ వ్యాధి సోకింది. వైద్యుల సూచనల మేరకు ఉన్న ఆస్తిని అమ్మేసి వైద్యం చేయించింది. అప్పటికీ వ్యాధి నయం కాలేదు. దాతల సాయంతో నెట్టుకొచ్చింది. 2020లో వ్యాధి తీవ్రత ఎక్కువైంది. అతని రెండు కిడ్నీలు పాడయ్యాయి. మంచం పట్టాడు. కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. శస్త్రచికిత్స జరిగే వరకు వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించాలన్నారు. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. వైద్యుల సూచనల మేరకు భర్త కిడ్నీ మార్పుకు ఆమె జీవనదాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించింది. ప్రస్తుతం భర్తకు వైద్యం అందించేందుకు ఆమె తీవ్ర ఇక్కట్లు పడుతోంది. ఆర్థికంగా కొట్టుమిట్టాడుతోంది. దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేస్తే తన భర్త బతుకుతాడని కన్నీటిపర్యంతమవుతోంది. ఆమెకు ఎవరైనా సాయం చేయాలనుకుంటే ఖాతా నంబర్ 212110100001246, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0821217. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వెంకోజీపాలెం బ్రాంచ్‌కు జమ చేయవచ్చు. లేదా 70953 62269, 9866 417811కు సంప్రదించవచ్చు.

దాతలే నా భర్తను కాపాడగలరు



నేను పోలియోకు గురయ్యాను. చిన్నప్పుడు రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. నా తండ్రి చనిపోయాడు. మేము ఏడుగురు అక్క చెల్లెళ్లం. నా తల్లికి మమ్మల్ని చూసే దిక్కు కరువైంది. దీంతో హాస్టల్లో ఉంటూ చదువుకున్నా. నా భర్త ఆటో డ్రైవర్. తనను ఇష్టపడి ఆదర్శ వివాహం చేసుకున్నారు. దివ్యాంగ పిల్లను చేసుకున్నావు.. అంటూ అత్త, మామలు నన్ను, నా భర్తను వదిలేశారు. నా భర్త ఇంతవరకు కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. ఆపదలో ఉన్నాం. ఆదుకోండి.

– వరలక్ష్మి

చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలు

డాబాగార్డెన్స్: నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ ఆటోలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు 65 ఎలక్ట్రిక్ వాహనాలు జీవీఎంసీకి చేరుకున్నాయి. తడి, పొడి చెత్తతో పాటు ఎలక్ట్రానిక్, హానికర వ్యర్థాలను ఈ వాహనాలు ద్వారా సేకరిస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత.. జీవీఎంసీ పరిధిలో ఇవి అందుబాటులోకి వస్తాయి.



గార్బేజ్ ఎలక్ట్రిక్ ఆటో

క్లుప్తంగా

నిర్మాత రామానాయుడు జయంతి వేడుకలు


నిరుపేద మహిళకు చీర అందిస్తున్న చందు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పరమేశ్వరి పార్కు వద్ద పట్టణ వెంకటేష్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో శతాధిక నిర్మాత డి.రామానాయుడు 87 జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ అభిమాన సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నిరుపేద మహిళలకు చీరలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

అనకాపల్లిటౌన్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జిల్లా ఫారెస్ట్ అధికారిణి పి.జ్యోతిర్మయి అన్నారు. స్థానిక శివ ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం జరిగిన పర్యావరణ పరిరక్షణపై జరిగిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దినచర్యలో భాగంగా ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటే అలవాటుగా మలుచుకోవాలని సూచించారు. మొక్కల ద్వారా ఆక్సిజన్ పుష్కలంగా లభిస్తుందన్నారు. అంతకుముందు ఆమె ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ కె.టి.వి.సాంబశివ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


కశింకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కల పెంపకం దోహదపడుతుందన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏవో ఎ.ఎ.ఖాన్, ఏపీవో శివ, హౌసింగ్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
సోమవారం 71 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడో రకం	3,900	4,000

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	:	రాజా
అహింస	:	సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	:	సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	:	షిర్డిసాయి
విరూపాక్ష	:	పర్తిసాయి
చక్రవ్యూహమ్	:	వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	:	శ్రీసత్య
బిచ్చగాడు-2	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 9 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 405 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

నిరుద్యోగులకు వరంలా స్కిల్ హబ్స్

- కోర్సు పూర్తయితే ఉద్యోగానికి భరోసా
- రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్
- వివిధ కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ


స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

తుమ్మపాల : డిగ్రీ పట్టా ఉన్నా నైపుణ్యాలు లేకపోతే ఏ రంగంలోనూ రాణించలేం. పోటీ ప్రపంచంలో రాణించాలన్నా, జీవనోపాధి పొందాలన్నా విద్యార్థతలతో పాటు ఆయా రంగాల్లో కనీస నైపుణ్యం అవసరం. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు, వృత్తి నిపుణులను తీర్చిదిద్ది పరిశ్రమలకు కావాల్సిన మానవ వనరులను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఇందులో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్ నిరుద్యోగులకు వరంగా మారాయి. నిరుద్యోగులు నైపుణ్యాభివృద్ధి, శిక్షణతో రాటుదేలుతున్నారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు..

మూడు నెలల శిక్షణ

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ హబ్స్ ఏర్పాటయ్యాయి. గతేడాది అక్టోబర్ 31న అనకాపల్లి మండలం రేబాకలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ భవన సముదాయంలో ప్రారంభించారు.

దీని ద్వారా నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నారు. హబ్స్‌లో అభ్యర్థులకు మూడు నెలలపాటు శిక్షణ అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ప్లేస్‌మెంట్స్, మిగిలిన వారికి పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తున్నారు.

ఒక్కో బ్యాచ్‌కు 30 మంది

స్కిల్ హబ్‌లలో ఒక్కో కోర్సులో బ్యాచ్‌కు 30 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ గాను, మొబలైజేషన్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందిన నిరుద్యోగులు 30 మందిలో దాదాపు అందరికీ పలు కంపెనీల్లో మంచి ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి. రెండు బ్యాచ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. మొదటి బ్యాచ్‌లో -22, రెండో బ్యాచ్‌లో 23 మంది ఉపాధి పొందారు. గత నెల నుంచి హబ్స్‌లో కొత్త బ్యాచ్ శిక్షణ తీసుకుంటోంది.

శిక్షణ పూర్తవగానే జాబ్ సాధించా...



బోటనీలో బీఎస్సీ డిగ్రీ చేశాను. స్కిల్ హబ్ ద్వారా జూనియర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తీసుకున్నాను. శిక్షణ పూర్తవగానే ఫెడ్‌సర్వ్ కంపెనీలో జాబ్ వచ్చింది. నెలకు రూ.19,650 జీతం వస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశంతోనే నైపుణ్యం పెంచుకుని ప్లేస్‌మెంట్ పొందాను.

– డి.భార్గవి

చక్కటి శిక్షణ ఇస్తున్నారు



2020లో బీఎస్సీ కెమిస్ట్రీ డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాను. ఓ రోజు స్కిల్ డెవలప్‌మెంట్ లింక్ క్లిక్ చేశాను. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ వివరాలు తెలిసాయి. ఇందులో చేరాను. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు అవసరమైన శిక్షణ అందించారు. నెలకు రూ.19 వేల జీతంతో ఫెడ్‌సర్వ్ కంపెనీలో ఉద్యోగం పొందాను.

-పి.చంద్రకళ

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



తొలి రెండు బ్యాచ్‌ల్లోనే 45 మంది ఉద్యోగాలు పొందారు. ఫెడ్‌సర్వ్, పాత్ర, ర్యాండ్‌స్టాడ్, స్ట్రైలెక్స్, హానర్, శ్రీరామ్, సీఈటీసీ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. ఆయా కోర్సుల్లో అనుభవం కలిగిన వారితో అభ్యర్థులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

-ఏఎంఎండీ చక్రవర్తి, కోఆర్డినేటర్, రేబాక

మలేరియా నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు


మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తుమ్మపాల ఆస్పత్రి వైద్య సిబ్బంది

అనకాపల్లి రూరల్: మలేరియా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎస్.వాణీ జగదీశ్వరి అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 30 వరకూ మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తుమ్మపాల ఆస్పత్రి వద్ద మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమల నివారణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.శారద, ఎంపీహెచ్‌ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎస్‌ఈవోబీ ఐ.శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్‌లు బి.సంగం, ఆర్.వి.నాగేశ్వరరావు, ఎం.మరియమ్మ, ఎం.మాణిక్యాంబిక, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మందికి నేత్ర శస్త్రచికిత్సలు


శస్త్రచికిత్స చేయించుకున్న వారితో ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్

అనకాపల్లి టౌన్ : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మందికి నేత్ర శస్త్ర చికిత్సలు చేసినట్టు ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ చెప్పారు. ఈనెల 4వతేదీన నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 8 మంది రోగులకు ఎంపిక చేసిన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. రోగులకు ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేపడుతున్న మహిళలు

అనకాపల్లి రూరల్ : ప్రకాశం జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త మరియమ్మను ట్రాక్టరుతో ఢీకొట్టి హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద మహిళా సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. కొంతసేపు రాస్తారోకో నిర్వహించారు. దీనికి నేతృత్వం వహించిన అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. హత్యకు గురైన అంగన్‌వాడీ కార్యకర్త మరియమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, సీఐటీయూ నేతలు కె.సోమునాయుడు, కె.సుజాత, కాసులమ్మ, త్రివేణి,రమణి,రామలక్ష్మి పాల్గొన్నారు.

10న నరాలవ్యాధి చికిత్స అంశంపై అవగాహన సదస్సు

అనకాపల్లి టౌన్ : స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఈనెల 10న నరాలవ్యాధి చికిత్స అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూక అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు అంతర్జాతీయ న్యూరో సర్జరీ నిపుణుడు మళ్ల భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

డ్వాక్రాసంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు

డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి


పూతరేకుల వ్యాపారం చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న పీడీ లక్ష్మీపతి

నక్కపల్లి: డ్వాక్రా సంఘాలకు రూ.10 నుంచి రూ.20లక్షల వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు, ఆటోల్లోను ద్విచక్ర వాహనాల్లోను పరిమితికి మించి ప్రయాణించరాదని సూచించారు. మహిళల్లో రక్తహీనత గురించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. బాల్యవివాహాలను అరికట్టాలని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులో మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చిన్నపిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించే వారికి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపారాలు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారి వ్యాపారాలు లాభనష్టాలను గురించి తెలుసుకున్నారు. వేంపాడులో పూతరేకులు తయారు చేస్తున్న మహిళ కుటుంబాన్ని ఆయన పలకరించారు. ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత వ్యాపారం జరుగుతోందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం సునీత, ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం ఉషాదేవి, మేనేజర్ కరుణానిధి, సీసీ రాజు, ప్రకాష్, గ్రామసంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా తుంపాలమ్మ పండగ



కశింకోట: అచ్చెర్ల గ్రామంలో మంగళవారం తుంపాలమ్మ వారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తుంపాలమ్మ వారిని అందంగా నగలు, పూలతో అలంకరించి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించారు.

తల్లీబిడ్డలకు ఆరోగ్య సందేశం...కిల్కారీ

- మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం
- కిల్కారీ సేవలపై అంగన్‌వాడీ, ఆశలకు అవగాహన



కిల్కారీ సేవలకు సంబంధించిన పోస్టర్, అవగాహన పొందుతున్న ఆశ కార్యకర్తలు

మునగపాక: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రతి వారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాయిస్‌కాల్ వస్తుంది. ఈ వాయిస్ కాల్ నిమిషం 30 సెకెండ్ల పాటు ప్రతి గర్భిణీ వినేలా కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

సందేహాల నివృత్తి

మహిళ గర్భిణీగా ఉన్నపుడు స్థానికంగా ఉండే ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలను నమోదు చేసేటపుడు ఫోన్ నంబరును నమోదు చేస్తారు. ఆ నంబర్‌కు కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయి. గర్భిణుల్లో తలెత్తే పలు సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుంది. మహిళ గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, అలాగే బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్ రూపేణా సందేశాలు వస్తాయి.

01244588000 నుంచి వాయిస్‌కాల్

గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ వాయిస్ కాల్ సుమారు నిమిషం 30 సెకెండ్ల పాటు ఉంటుంది. గర్భిణులు బిజీగా ఉండి ఫోన్ లిఫ్ట్ చేయని పరిస్థితిలో ఐవీఆర్ సిస్టమ్ ఆటోమెటిక్‌గా ఒకేరోజు మూడుసార్లు ఫోన్ కాల్స్ వచ్చేలా చేస్తుంది. మరలా సంబంధిత సందేశాలను వినాలని అనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినే సౌకర్యం కూడా కిల్కారీ ద్వారా కల్పించారు.

అశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

కిల్కారీ సేవలకు సంబంధించి పీహెచ్‌సీల ద్వారా ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెలా మొదటివారం జరిగే ఆశ కార్యకర్తలకు ఈ సేవలకు సంబంధించి వైద్యాధికారులు పదే పదే అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భోజన సదుపాయం, పోషక విలువలు కలిగిన ఆహారం పొందేందుకు వచ్చే గర్భిణులకు కిల్కారీ సేవలకు సంబంధించిన వీడియో చూపించేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియచేసేలా కార్యక్రమం రూపొందించారు.

సర్వీస్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి స్థల పరిశీలన


రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకొని సర్వీస్ రోడ్డు నిర్మాణ స్థలాన్ని ఎంపీ సత్యవతి మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సుమారు 600 ఎకరాల సాగు భూమికి వెళ్లాల్సిన రహదారి సమస్యను రైతులు ఇటీవల ఎంపీ సత్యవతి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆమె మంగళవారం నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి భూమికి రైతులు చేరుకునేందుకు సర్వీస్ రహదారి ఏర్పాటుపై మాట్లాడారు. దీనికి అంగీకరించిన హైవే అధికారులు సర్వీస్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించే స్థలాలను ఎంపిక చేసినట్టు ఎంపీ సత్యవతి వివరించారు. ఆ స్థలాలను పరిశీలించి సర్వీస్‌రోడ్డుతో పాటు సాగుభూమిలోకి వర్షపునీరు రాకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నట్టు రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం


నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు దొరబాబు

కశింకోట : నూతలగుంటపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కారెడ్డి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబానికి అనకాపల్లి వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆర్థికంగా చేయూత అందించారు. నెలకు రూ.3 వేలు వంతున ప్రతి నెలా ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య వెంకటలక్ష్మికి బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో పాటు ఇద్దరు పిల్లలకు రత్నాకర్ తన సొంత నిధులు సమకూర్చి చదివించడానికి హామీ ఇచ్చినట్టు మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగి దొరబాబు తెలిపారు. దీంతో గ్రామ పెద్దలు, పార్టీ ప్రతినిధులు రత్నాకర్ దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు దండిన శ్రీను, సరలంపూడి వెంకట్, చొప్ప బాలకృష్ణ, పిల్లి సుందరం, సోమిరెడ్డి తార, ఉగ్గిన భాస్కరరావు పాల్గొన్నారు.

వడగాడ్పులతో అల్లాడిన జనం


నూతలగుంటపాలెంవద్ద ఎండ తీవ్రతతో వెలవెలబోతున్న జాతీయ రహదారి


నిర్మానుష్యంగా మారిన ఎన్టీఆర్ క్రీడామైదానం రహదారి

కశింకోట: మండల ప్రజలు వేసవి తాపంతో మంగళవారం సతమతమయ్యారు. అధిక ఉష్ణోగ్రతతో పాటు వడగాడ్పులు వీచాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. జాతీయ రహదారి సహా పంచాయతీ ప్రధాన రోడ్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. గూగుల్ సమాచారం మేరకు ఇక్కడ 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కశింకోట ప్రాంతంలో సాయంత్రం ఆకాశం మేఘావృతమై గాలులు వీచి వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

భానుడు ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి

అనకాపల్లిటౌన్: పట్టణవాసులు భానుడి తాపానికి మంగళవారం ఉక్కిరిబిక్కిరయ్యారు. 38.8 ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేడి గాలులు వీయడంతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయారు. 11 గంటల ప్రాంతంలో వీచిన వేడిగాలులకు ప్రజలు ఇళ్లకు పరిమితమయ్యారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం 5.30 గంటల సమయంలో వీచిన చల్లటిగాలులకు కాసింత సేదతీరారు.

ఈదురు గాలుల బీభత్సం


నరసింగబిల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన కొబ్బరి చెట్టు

కశింకోట : మండలంలో మంగళవారం రాత్రి పెను గాలులతో కురిసిన వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పలు చోట్ల చెట్లు, కొమ్మలు, సుమారు 20 వరకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయి అత్యధిక గ్రామాలు అంధకారం మగ్గుతున్నాయి. అచ్చెర్ల వద్ద 11 కె.వి విద్యుత్ లైన్ స్తంభం విరిగిపోయింది. దీంతో అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే అవకాశం లేదని విద్యుత్ అధికారులు తెలిపారు. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే మార్గంలో కూడా రోడ్డు పక్కనున్న చెట్లు, కొమ్మలు గాలులకు ఎల్‌టీ విద్యుత్ స్తంభాలపై కూలిపోయాయి. దీంతో కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జి.భీమవరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలపై చెట్లు కూలడంతో ఎ.ఎస్ పేట, సోమవరం, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పరవాడపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ లేక అంధకారం నెలకొంది. అయితే తాళ్లపాలెం, చింతలపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం గ్రామాల్లో రాత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ కె.రాజశేఖర్ తెలిపారు. మిగిలిన గ్రామాల్లో సాధ్యమైనంత తొందరలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు తమ సిబ్బంది చర్యలు చేపడుతున్నారన్నారు.

కశింకోట : తాళ్లపాలెం ప్రాంతంలో ఈదురుగాలులతో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాళ్లపాలెం కూడలి ప్రాంతంలో వర్షం నీరు నిలిచిపోయి నర్సీపట్నం మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది చెందారు. గాలులకు చెట్టు కొమ్మలు పడడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వేసవి తాపంతో సతమతమవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఉపశమనం చెందారు.

కన్నూరుపాలెంలో వడగళ్ల వాన

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి వడగళ్ల వాన కురిసింది. ఈదురు గాలులు, వర్షంతోపాటు చిన్న సైజులో వడగళ్లు పడినట్లు స్థానికులు తెలిపారు. దీంతో వాటితో పిల్లలు సరదాగా ఆటలాడుకున్నారు. చుట్టు పక్కల ఉన్న జి.భీమవరం, సుందరయ్యపేట, ఉగ్గినపాలెం తదితర గ్రామాల్లో కూడా పెద్ద వర్షం కురిసింది. దీంతో పాటు వీచిన గాలులకు పలుచోట్ల చెట్టు కొమ్మలు విరిగి. విద్యుత్ లైన్లు దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

రాంబిల్లి: రాంబిల్లిలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం తీర్థ మహోత్సవాన్ని నిర్వహించారు. బాణసంచా కాల్చారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.